క్లుప్తంగా

ఎస్పీ అభినందన



హరిణిని అభినందిస్తున్న ఎస్పీ రోహిత్‌రాజు

కొత్తగూడెంఅర్బన్: పోలీస్ కంట్రోల్ రూమ్ విభాగంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న లక్ష్మణ్ కుమార్తె హరిణి పదో తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించింది. ఈ మేరకు బుధవారం ఆమెను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, పీసీఆర్ ఇన్‌స్పెక్టర్ ముత్యం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ అభ్యర్థిని గెలిపించండి..

పాల్వంచరూరల్: ఖమ్మం పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తాండ్ర వినోదరావును గెలిపించాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం స్థానిక మున్సిపాలిటీ పరిధిలో న్యూవిద్యుత్ కాలనీ, సీతారాంపట్నంలో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కమలం పువ్వుగుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, చింతలచెరువు శ్రీనివాసరావు, రాపాక రమేష్, సందీప్, వల్లపు మురళి యాదవ్, పాల్లోజు క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్ యాదగిరి

ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఎన్నికల అధికారుల సూచన మేరకు పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ యాదగిరి సందర్శించి పరిశీలించారు. బుధవారం మున్సిపల్ యంత్రాంగంతో కలిసి పట్టణంలోని పలు పాఠశాలలను సందర్శించారు. అక్కడి పాఠశాలలకు పహరీలు, తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు, తలుపులు, కిటికీలు, ఫ్లోరింగ్, ఫ్యాన్లు తదితర ఏర్పాట్లను పరిశీలించారు. సదుపాయాలు లేని పాఠశాలల్లో వాటిని వెంటనే ఏర్పాటు చేసేందుకు అంచనా వేశారు. ఆయన వెంట మేనేజర్ అంకుషావలీ, ఏఈ కుమారస్వామి ఉన్నారు.

ప్రతిభ చూపిన బాలికోన్నత పాఠశాల విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాల్వంచ: పదో తరగతి ఫలితాల్లో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 157 మంది పరీక్షకు హాజరు కాగా 137 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్.సబీనా 9.3, పి.సిరి అశ్రిత 9.2, బి.భానుజ్యోతి, ఎస్.దిశ, కె.లావణ్య, సీహెచ్.ప్రవల్లిక, ఎం.కావ్యశ్రీ 9 జీపీఏ సాధించారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యాక్రమంలో విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు రమ, ఉపాధ్యాయులు అభినందించారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



సరుకులు అందజేస్తున్న టీచర్ జ్యోతి

కొత్తగూడెంరూరల్: వేసవికాలంలో ఎదురయ్యే ఆరోగ్య సమస్యల పట్ల గర్భిణులు, బాలింతలు, అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ టీచర్ బానోతు జ్యోతి సూచించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని దట్టమైన అటవీ ప్రాంతంలో గొత్తికోయ గిరిజనులు నివాసం ఉంటున్న క్రాంతినగర్‌కు బుధవారం అంగన్‌వాడీ టీచర్ జ్యోతి ద్విచక్రవాహనంపై వెళ్లి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. అనంతరం చిన్నారుల బరువు, ఎత్తు కొలతలు తీసుకుని వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నేటినుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం సెలవులు ప్రకటించినందున్న ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున్న ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకుని తీసుకోవాలని, వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

హక్కుల సాధనకు పోరాటాలు

ప్రపంచ కార్మికులారా ఏకం కండి, ఎర్ర జెండా సాక్షిగా కార్మిక హక్కులకై పోరాడుదామని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా చికాగో అమరుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్మిక జెండాలను ఎగురవేశారు. వక్తలు.. మాట్లాడుతూ సామ్రాజ్యవాదం, పెట్టుబడిదారి దేశమైన అమెరికాలోనే ఈ ఎర్రజెండా పుట్టిందని, ఆనాడే కార్మికుల హక్కుల కోసం, పనిదినాల కోసం వీరోచితమైన పోరాటాలు సాగించి కార్మికుల హక్కులను సాధించుకున్నట్లు పేర్కొన్నారు. సమాన పనికి సమాన వేతనం, కార్మికుల హక్కులు నెరవేరే వరకు పోరాడుతామన్నారు. ఆయా కార్యక్రమాలలో పలు రంగాల కార్మికులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



సింగరేణి(కొత్తగూడెం): ఆర్‌సీహెచ్‌పీలో కార్మికశక్తి అవార్డులు అందుకుంటున్న కార్మికులు



ఇల్లెందురూరల్: సీఎస్పీబస్తీ రాజీవ్‌నగర్‌తండాలో ఎర్రజెండా ఎగురవేస్తున్న సీపీఎం నాయకులు





పాల్వంచ: జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అప్పారావు, టీఆర్‌వీకేఎస్ ఆధ్వర్యంలో..





ఇల్లెందు: సీఎస్పీ వద్ద, ఎర్రజెండా ఎగురవేస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య



సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో...



సుజాతనగర్‌లో మే డే వేడుకలు



కొత్తగూడెంరూరల్: మే డే వేడుకల్లో పాల్గొన్న జీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు



కొత్తగూడెంఅర్బన్: జెండా ఆవిష్కరిస్తున్న దృశ్యం



ఇల్లెందురూరల్: రాఘబోయినగూడెంలో...



ఒంపుగూడెంలో అమరుల స్థూపం వద్ద...



టేకులపల్లి: కేజీసీ చెక్‌పోస్టు వద్ద



ఇల్లెందురూరల్: చల్లసముద్రం పెంకు పరిశ్రమలో



ఇల్లెందు: సోలార్ ప్లాంట్ వద్ద...



టేకులపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద...



సీపీఐ ఆధ్వర్యంలో..



జూలూరుపాడు: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పులిహోర, మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో..



సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో



సింగరేణి(కొత్తగూడెం): రైటర్ బస్తీలో జెండా ఆవిష్కరణ

అభివాదం చేస్తూ వెళ్లిన కేసీఆర్



టేకులపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న కేసీఆర్, మాలోతు కవిత



ఇల్లెందులో కేసీఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

టేకులపల్లి/ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ ఎంపీ అభ్యర్థి మాలోతు కవిత గెలుపును కాంక్షిస్తూ మాజీ సీఎం కేసీఆర్ బుధవారం చేపట్టిన రోడ్ షో కొత్తగూడెం నుంచి టేకులపల్లి మీదుగా ఇల్లెందుకు కొనసాగింది. టేకులపల్లికి కేసీఆర్ రాక కోసం మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, హరిసింగ్‌నాయక్, మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు టేకులపల్లి సెంటర్‌కు తరలివచ్చారు. కేసీఆర్‌కు వేసేందుకు గజమాలను సిద్ధం చేశారు. అందరూ ఎదురు చూస్తుండగా కేసీఆర్ వాహనంలో వచ్చారు. నాయకులు, కార్యకర్తలు ఆనందోత్సాహంతో బస్సులో ఉన్న కేసీఆర్‌కు హారతి పట్టారు. గుమ్మడి కాయలు పగుల కొట్టి దిష్టి తీశారు. కానీ బస్సులో నుంచే కేసీఆర్, కవితలు అందరికీ అభివాదం చేస్తూ ఆగకుండానే ఇల్లెందు వైపుకు వెళ్లిపోయారు. కేసీఆర్ ఆగుతారని, సందేశం ఇస్తారని, గజమాల ధరిస్తారని ఆశించిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు నిరాశే మిగిలింది. తరువాత కేసీఆర్‌కు ఇల్లెందులో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. బూడిద గుమ్మడి కాయలతో దిష్టి తీసి హారతి ఇచ్చి స్వాగతం పలికారు. బీఆర్ఎస్ శ్రేణులకు అభివాదం చేస్తూ కేసీఆర్ బయ్యారం వైపు వెళ్లారు. మహబూబాబాద్‌లో కార్నర్ మీటింగ్‌లో పాల్గొనాల్సి ఉండగా ఇల్లెందులో ఆయన ప్రసంగించకుండా బస్ నుంచి కిందకు రాకుండానే వెళ్లిపోయారు. దీంతో నాయకులు నిరాశతో వెనుదిరిగారు.

గ్రామాల్లో తాగునీటి సమస్య రావొద్దు..

పాల్వంచరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.విజయభాస్కరరెడ్డి ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పాల్గొని మాట్లాడారు. ఎండలు తీవ్రమైన దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులను గుర్తించి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని, చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కూలీలు ఉపాధి పనులకు ఉదయం 6 గంటలకే వెళ్లాలని రూ.300 వచ్చేవిధంగా పనులు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాల కల్పనను చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీఓ బి.నారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నీలావతి, ఏపీఓ పొరండ్ల రంగా, ఈసీ పుల్లయ్య, గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయభాస్కరరెడ్డి

రిటైర్డ్ ఉద్యోగికి సన్మానం



రాజేశ్వరరావును సన్మానిస్తున్న వివిధ యూనియన్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ నాయకులు, 5 ఇంక్‌లైన్‌లో డిప్యూటీ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న బోటిక రాజేశ్వరరావు ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా గాంధీపథం, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, టీబీజీకేఎస్, బీఎంఎస్, హెచ్‌ఎంఎస్ యూనియన్ నాయకులు ఆయనకు సన్మానించారు. ఈ సందర్భంగా గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థలో సుమారు 40 ఏళ్ల పూర్తి సర్వీసు చేసే అదృష్టం కొందరికే ఉంటుందని, వారిలో రాజేశ్వరరావు ఒకరన్నారు. ఆయన శేషజీవితం ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. గొల్లపల్లి దయానంద్, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏపీ రామారావు, కాలం నాగభూషణం, గాంధీపథం కన్వీనర్ చింతల చెరువు గోర్ధం, కూసన వీరభద్రం, చిలక రాజయ్య, బోరింగ్ శంకర్ పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని 24 ఏరియాకు చెందిన ఓ మహిళ అదృశ్యమైంది. గత నెల 27 రాత్రి భవాని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించలేదు. తండ్రి సత్యం ఫిర్యాదు మేరకు ఎస్ఐ సందీప్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భవానికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

రామనర్సుకు నివాళి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వకీల్‌పల్లి భూగర్భగని మేనేజర్ పాక రవికిరణ్ తండ్రి రాయనర్సు (74) మంగళవారం అనారోగ్యంతో కొత్తగూడెంలో మృతి చెందారు. విషయం తెలిసిన సీఐటీయూ నాయకులు బుధవారం ఆయన స్వగృహంలో ఆయన భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

‘రామసహాయం’ను గెలిపించండి

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం మున్సిపాలిటీ ఏరియాల్లోని సమస్యలు నాకు వివరిస్తే ఆ సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి పొంగులేటి మాధురి అన్నారు. బుధవారం లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంత్‌నగర్ పంచాయతీ పరిధిలో ఖమ్మం పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి రామసహాయం రఘురాంరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ భవనాలకు వారి సొంత భూములు ఉచితంగా ఇచ్చిన కుటుంబం ఆయన పుట్టింది ఉమ్మడి ఖమ్మం జిల్లాలోనేని వృత్తి రీత్యా మరిపెడ బంగ్లాకు వెళ్లారని, ఆయన పక్కా లోకల్ వాస్తవ్యుడు అన్నారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కొత్తగూడెం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖర్‌రావు, తోటదేవీ ప్రసన్న హైమవతి, తూము చౌదరి, ఆళ్ల మురళీ, కొనేరు సత్యనారాయణ, గౌస్ పాషా, చీకటి కార్తిక్, పాల సత్యనారాయణరెడ్డి, అంతోటి పాల్, కనక రాజు, వెంకటేశ్, రావి రాంబాబు, జేబీఎస్ చౌదరి, మసూద్, టీజేఎస్ శివ, విప్లవరెడ్డి, కోరి ఉన్నారు.



మాట్లాడుతున్న మాధురి

లింకు రోడ్డును అభివృద్ధి చేయండి

హామీ ఇస్తేనే ఓటు అంటున్న రైతులు



ఫ్లెక్సీ కట్టి నిరసన తెలుపుతున్న రైతులు (ఫైల్)

జూలూరుపాడు: అన్నారుపాడు నుంచి పంట పొలాలకు వెళ్లే మంగళగిరి లింకు డొంకదారిని అభివృద్ధి చేయాలని రైతులు కోరుతున్నారు. దశాబ్దాల కాలంగా అన్నారుపాడు, బచ్చలకోయగూడెం, పాపకొల్లు తదితర గ్రామాల రైతులు, కూలీలు నడిచే మంగళగిరి లింకు డొంకదారి వానాకాలంలో బురద, గుంతలమయంగా మారడంతో నడిచే పరిస్థితి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొలాలకు మందుకట్టలు తీసుకెళ్లాలన్నా పండించిన పంటను ఇంటికి, మార్కెట్‌కు తరలించే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంతమంది ఎమ్మెల్యే, ఎంపీలు మారినా మంగళగిరి డొంక అభివృద్ధికి నోచుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. ఎన్నికలు వచ్చినప్పుడు హామీలు ఇచ్చి గెలిచిన తరువాత పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డొంక దారిని బాగు చేస్తామని హామీ పత్రం రాసిచ్చిన వారికే మా ఓటు వేస్తామంటూ అన్నారుపాడులో రైతులు విన్నూతంగా ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన విధంగానే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఫ్లెక్సీ కట్టారు. అన్నారుపాడు నుంచి పొలాల వరకు సుమారు 5 కిలోమీటర్ల మేర ఈ డొంక దారి ఉంది. సుమారు 2 వేల ఎకరాలు వ్యవసాయ భూములు ఉండటంతో వందలాది మంది రైతులు నిత్యం ఈ దారిలో అవస్థలు పడుతున్నారు. వర్షాకాలంలో దారంతా మోకాళ్లలోతు బుదుగులోనే పంట పొలాలకు అష్టకష్టాలు పడి వెళ్లాల్సి వస్తోంది. ఈ డొంక దారి గుండా పొలాలకు వెళ్లాలంటే మూడు వాగులు దాటాల్సి ఉంటుందని, దారంతా నల్లరేగడి మట్టితో కూడుకోవడంతో వానాకాలంలో నరకయాతన పడుతున్నామని రైతులు చెబుతున్నారు. వ్యవసాయ పనులు ప్రారంభం నుంచి ట్రాక్టర్లు, ట్రాలీలు, ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి ఉండదని, మందు కట్టలు పొలానికి తీసుకెళ్లాలంటే అవస్థలు తప్పడం లేదంటున్నారు. పండించిన పంటను ఇంటికి తీసుకరావాలంటే ట్రాక్టర్లు, ట్రాలీలు, ఎడ్లబండ్లు బురదలో దిగబడుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి ఆ తరువాత పట్టించుకోవడం లేదు. ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే డొంక దారిని అభివృద్ధి చేస్తామని హామీ పత్రం ఇచ్చిన నాయకుడికి ఓటు వేసి వేస్తామంటున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మంగళగిరి లింకు డొంకదారి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.



అన్నారుపాడు - మంగళగిరి లింకు డొంక దారి

ఇబ్బంది పడుతున్నాం..



అన్నారుపాడు నుంచి పొలాల వరకు ఉన్న మంగళగిరి డొంకను అభివృద్ధి చేయాలి. ఎన్నో ఏళ్లుగా డొంక దారి సరిగా లేక ఇబ్బందులు పడుతున్నాం. ఎన్నిసార్లు అధికారులకు, నాయకులకు చెప్పినా పట్టించుకోవడంలేదు. దారిని నిర్మిస్తామని ఏ నాయకుడు హామీ ఇస్తే వారికే ఓటు వేస్తాం.

– బానోత్ కృష్ణ, రైతు, అన్నారుపాడు

రైతుల గోస పట్టించుకోవడం లేదు



రైతుల గోస ఎవరూ పట్టించుకోవడం లేదు. ఎన్నికల సమయంలో ఓట్లు కోసం వచ్చినప్పుడు నాయకులందరూ హామీ ఇస్తారు, ఆ తరువాత పట్టించుకోవడం లేదు. వానా కాలంలో పొలాలకు వెళ్లాలంటే మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వం డొంకదారిని బాగు చేయాలి.

– బాదావత్ పద్మ, రైతు, అన్నారుపాడు

అభివృద్ధిపై దృష్టి పెట్టాలి...



డొంక బాగలేకపోవడంతో నరకయాతన పడుతున్నాం. వానా కాలంలో డొంకదారి మోకాళ్లలోతు బురదలో అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంటుంది. పశువులు, మూగజీవాలు సైతం వెళ్లాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు డొంకదారి అభివృద్ధి కోసం దృష్టి పెట్టాలి.

– బానోత్ రవి, రైతు అన్నారుపాడు